4 | నమస్తే తెలంగాణ
కరీంనగర్
శనివారం 8 ఫిబ్రవరి 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అంటుకున్న కులగణన కుంపటి

డాక్టర్ శ్రవణ్ దాసోజు

పంచ పాండవులెందరంటే మంచం కోళ్ల లెక్క ముగ్గురు అని చెప్పి, రెండు వేళ్లు చూపించి, ఒకటి రాశాడంట వెనుకటికొకడు. తెలంగాణలో రేవంత్ సర్కారు చేసిన కులగణన సర్వే కూడా అచ్చం అలాంటిదే. సమగ్ర సర్వే పేరిట చేపట్టిన గణనలో అసమగ్ర వివరాలు పొందుపరచడం రేవంత్‌కే చెల్లింది. బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి రేవంత్‌కు ఏ మాత్రం లేదు. అందుకే, సర్వేను తప్పుల తడకగా చేసి, కాకి లెక్కలతో మమ అనిపించారు.

బీసీ వర్గాల ఓట్ల వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటైందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రాహుల్‌గాంధీతో సహా కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మిన బీసీ ప్రజలు ఆ పార్టీకి గంపగుత్తగా ఓట్లు వేశారు. నమ్మినవాళ్లను నట్టేట ముంచినట్టు తమను గద్దెనెక్కించిన బీసీలను కూడా రేవంత్‌రెడ్డి నిండా ముంచిండు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పూనే తెరవెనుక గోతులు తవ్వింండు. ఇచ్చిన హామీని ఎగ్గొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నడు.

ఒక విధానమనేది పాటించకుండా, లెక్కాపత్రం లేకుండా చేసిన కులగణన వల్ల బీసీలకు నష్టమే. సాధారణంగా కాలంతోపాటు జనాభా కూడా పెరుగుతుంది. 2014లో తెలంగాణ ఏర్పడినాక కేసీఆర్ సర్కార్ తొలిసారిగా చేసిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం... రాష్ట్ర జనాభా 3.68 కోట్లు. తాజాగా కాంగ్రెస్ సర్కార్ చేసిన కులగణన ప్రకారం రాష్ట్ర జనాభా 3.70 కోట్లుగా తేలింది. అంటే గత పదేండ్లలో రాష్ట్ర జనాభా రెండు లక్షలు మాత్రమే పెరగడం వివాదాలకు తావిస్తున్నది. మన రాష్ట్ర వార్షిక జనాభా వృద్ధిరేటు 1.35 ఈ లెక్కన పదేండ్లలో రాష్ట్ర జనాభా 4.18 కోట్లకు చేరాలి.

జనాభా వృద్ధిరేటు ఏ ఒక్క వర్గానికో పరిమితం కాదు. జనాభా పెరుగుదలలో అన్నివర్గాల ప్రాతినిధ్యం ఉంటుంది. కానీ, కాంగ్రెస్ సర్కారు చేసిన సర్వేలో ఒక వర్గం జనాభా మాత్రమే భారీగా పెరగడం అనుమానాలకు తావిస్తున్నది. జనాభా పెరుగుదలలో అప్పటికే రాష్ట్రంలో మెజారిటీ వర్గంగా ఉన్న సామాజిక వర్గానికి ఎక్కువ వాటా ఉండాలి. అయితే రాష్ట్రంలో అతి పెద్ద సామాజికవర్గమైన బీసీల జనాభా గత పదేండ్లలో 51 శాతం నుంచి 46 శాతానికి పడిపోవడం విడ్డూరం. రాష్ట్రంలో అతి తక్కువగా ఉన్న ఓసీల జనాభా భారీగా పెరగడం చర్చనీయాంశం. సాధారణంగా ఓసీ సామాజిక వర్గ ప్రజలకు కుటుంబ నియంత్రణపై చాలా అవగాహన ఉంటుంది. అయితే, మన రాష్ట్రంలో మాత్రం ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గి ఓసీల సంఖ్య పెరగడం గమనార్హం.

కల్యాణలక్ష్మి పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 14 లక్షల జంటలు చెక్కులందుకున్నాయి. అంతేకాదు, 2017 నుంచి 2023 జూన్ వరకు సుమారు 14 లక్షల మంది తల్లులు కేసీఆర్ కిట్ అందుకున్నారు. ఈ లెక్కన ఒక్కో కొత్త జంటకు ఒకరు చొప్పున పిల్లలు పుట్టినా రాష్ట్ర జనాభా సుమారు 14 లక్షలకు పైగా పెరగాలి. కానీ రెండు లక్షలే పెరిగింది. అంతేకాదు, 2024లో ఎన్నికల సంఘం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 3.28 కోట్ల మంది ఓటర్లున్నారు. కులగణన ప్రకారం రాష్ట్రంలో 3.70 కోట్ల మంది మాత్రమే ఉన్నట్టు కాంగ్రెస్ సర్కారు చెప్తున్నది. అంటే రాష్ట్రంలో 18 ఏండ్ల లోపు జనాభా 42 లక్షలు మాత్రమేనా? వాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం ఇష్టం లేదు. అధికారంలోకి రావడం కోసమే కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించి, ఇప్పుడు ఏదో ఒక హడావుడి చేసి తప్పుడు లెక్కలతో చేతులు దులుపుకోవాలని చూస్తున్నడు. అందులో భాగంగానే మొదట రాష్ట్ర బీసీ కమిషన్‌కు కులగణన బాధ్యతను అప్పగించారు. ఆ కమిషన్ అనేక జిల్లాల్లో పర్యటించింది కూడా. ఈ నేపథ్యంలో కోర్టు మొట్టికాయలు వేయడంతో ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అంతేకాదు, కులగణన ప్రక్రియ డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో జరగలేదు. హడావుడిగా, అసమగ్రంగా చేసిన ఈ సర్వే వివరాలు సర్వోన్నత న్యాయస్థానం ముందు నిలువవని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. అందుకే, అసెంబ్లీలో తీర్మానం చేసి బంతిని కేంద్రం కోర్టులో పడేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు.

రేవంత్ ప్రభుత్వ తీరును మొదటినుంచి గమనిస్తున్న ప్రజలు ఈ సర్వేలో పెద్దగా పాల్గొనలేదు. అసంబద్ధమైన ప్రశ్నాపత్రం, వ్యక్తిగత గోప్య సమాచారాన్ని సేకరించడం, చాలామంది తమ వివరాలు చెప్పేందుకు ఇష్టపడలేదు. కొందరు ప్రభుత్వంపై ఆగ్రహంతో అధికారులను నిలదీశారు. దీంతో హడావుడిగా 50 రోజుల్లోనే తూతూ మంత్రంగా సర్వే పూర్తిచేసి మమ అనిపించారు. ఎవరు చెప్పినా వినకుండా, 57కి పైగా ప్రశ్నలు గల సుదీర్ఘ ప్రశ్నపత్రాన్ని రూపొందించి, సరైన పూర్తి వివరాలు రాబట్టలేకపోయారు. గతంలో బీహార్ ప్రభుత్వం ఇలాంటి సర్వేను 10 నెలలు పైగా రెండు విడతల్లో చేసి సమగ్ర వివరాలు రాబట్టింది. 17 ప్రశ్నలనే సంధించిన బీహార్ ప్రభుత్వం కులాలవారీ వివరాలతో పాటు ఆర్థిక, విద్య, ఉద్యోగ, వృత్తిపరమైన సమాచారాన్ని కూడా వెల్లడించింది.

కులగణన జరగాలని, దామాషా పద్ధతిలో రిజర్వేషన్స్ ఇవ్వాలని, విద్య, ఉద్యోగరంగాల్లో ఉన్నట్టుగానే రాజకీయ రంగంలోనూ బీసీ వర్గీకరణ జరగాలని మొదటినుంచి నేను కొట్లాడుతూ, హైకోర్టులో పలుమార్లు కేసులు వేశాను. ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసి దాని ఆధ్వర్యంలో కులగణన చేపట్టాలని కోర్టులో వాదించాం. మా వాదనలు విన్న న్యాయస్థానం 2024, ఆగస్టు 6న ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుచేయాలని, దాని ఆధ్వర్యంలో కులగణన చేయాలని రేవంత్ సర్కార్‌ను ఆదేశించింది. అయినప్పటికీ రేవంత్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడలేదు. హైకోర్టు ఆర్డర్‌ను మూర్ఖత్వంతో బేఖాతరు చేస్తూ ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేసింది. దీంతో ఆర్.కృష్ణయ్య మళ్లీ అదే అంశంపై కోర్టుకు వెళ్లారు. ఆ పిటిషన్‌పై అక్టోబర్ చివరలో కోర్టు మళ్లీ అదే తీర్పు ఇచ్చింది. అప్పటికే నెలన్నరకు పైగా జాప్యం జరిగింది. ఆగస్టులో మొదటి తీర్పు వచ్చినప్పటికీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయకుండా నవంబర్ వరకు కావాలనే జాప్యం చేయడమే బీసీ కులగణన పట్ల రేవంత్ సర్కారుకు ఏ పాటి చిత్తశుద్ధి ఉన్నదో చెప్పేందు కు నిదర్శనం. హైకోర్టు తీర్పు నేపథ్యంలో నవంబర్ 4న రిటైర్డ్ బ్యూరోక్రాట్ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. నెలలోపే నివేదిక సమర్పిస్తామని రేవంత్ సర్కార్ గప్పాలు కొట్టింది. కానీ, మూడు నెలలు గడిచినా డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఇప్పటికీ బయట పెట్టలేదు. ఆ నివేదికతో సంబంధం లేకుండానే కులగణన చేపట్టింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక లేకుండా రిజర్వేషన్లపై ఏ విధంగా నిర్ధారణకు వస్తున్నారనేది రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి.

కులగణన సర్వే మొత్తం లోపభూయిష్టంగా జరిగింది. అందులో సంఖ్యాపరమైన తప్పులు చాలా ఉన్నాయి. సుమారు 16 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదని ప్రభుత్వమే చెప్తున్నది. అలాంటప్పుడు ఈ సర్వే ఎలా ప్రామాణికమవుతుంది. అంతేకాదు, బీసీల జనాభా భారీస్థాయిలో తగ్గిపోవడానికి కారణమేంటి? ఈ పదేండ్లలో లక్షల మంది చనిపోయారా? అదే జరిగితే వారి డెత్ సర్టిఫికెట్లు ఏమయ్యాయి?

రేవంత్ రెడ్డి తన అసమర్థతను, చేతకానితనాన్ని, బీసీల పట్ల ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి షబ్బీర్ అలీని ముందుపెట్టి డ్రామా చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని షబ్బీర్ అలీ రేవంత్‌కు లేఖ రాయడం హాస్యాస్పదం. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక స్థితిగతులను తెలుసుకొని, తద్వారా ఎలాంటి పథకాలు అమలుచేస్తే ప్రజలు వృద్ధిలోకి వస్తారనే అవగాహన కోసం నాడు కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. ఆ సర్వే వివరాల ఆధారంగానే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, దళితబంధు, పింఛన్ల పెంపు, చేపపిల్లలు, గొర్ల పంపిణీ లాంటి అనేక బృహత్తర సంక్షేమ పథకాలను వివిధ వర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టారు. కేసీఆర్ నేతృత్వంలో పర్ క్యాపిటా ఇన్‌కం రూ.1.15 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెరిగిందంటే, దానికి కారణం వారి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సేకరించిన డాటా వివరాలతో ప్రజాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వల్లే. పదకొండేండ్ల పాటు మొద్దు నిద్రలో ఉన్న రేవంత్ ప్రభుత్వం ఇప్పుడు మేలుకొని బీసీ కోటా ఇవ్వడంలో తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ సర్కారు చేసిన సమగ్ర కుటుంబ సర్వేపై బట్ట కాల్చి మీద వేయాలని చూస్తున్నది. విచారణ కచ్చితంగా జరగాల్సిందే కానీ, అది సమగ్ర సర్వేపై కాదు, రేవంత్‌రెడ్డి చేసిన కులగణనపై.

వందల కోట్లు ఖర్చుపెట్టి మరీ బీసీల సంఖ్యను ఎందుకు తక్కువగా చూపెడుతున్నారు? దీని వెనకున్న రాజకీయ కుట్ర ఏమిటి? ఫ్యూడల్ మనస్తత్వ కుట్ర చేస్తున్నదెవరు? వందల కోట్లు ఖర్చుపెట్టి చేసిన సర్వే పత్రాలను బీసీ సంఘాలు తగులబెట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? తదితర అంశాలపై మొదట సీబీఐ విచారణ జరగాలి.

బీసీల భావోద్వేగాలతో రేవంత్‌రెడ్డి ఆటలాడుతున్నారు. నాడు కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు రాజ్యాంగ సవరణ అవసరమని చెప్పడం ఖండనీయం. రాజ్యాంగ సవరణ అవసరమని రేవంత్‌రెడ్డికి నేడు గుర్తుకొచ్చిందా? డిక్లరేషన్ ప్రకటించిన రోజు ఈ విషయం ఆయనకు తెలియదా? అసెంబ్లీలో తీర్మానం చేసిన నాడు దీనిపై ఎందుకు మాట్లాడలేదు? తీరా అమలుచేసే సమయానికి కేంద్రంపై నెపం నెట్టేసి తప్పించుకునే ప్రయత్నం చేయడం హేయం. ఇది రేవంత్ ప్రభుత్వానికి ఏ మాత్రం తగదు. ఇది ముమ్మాటికీ బీసీలను మోసం చేయడమే. ఇప్పటికైనా జరిగిన చారిత్రాత్మక తప్పిదాన్ని రేవంత్‌రెడ్డి అంగీకరించాలి. రీ సర్వే చేయించి ఆ తప్పులను సరిచేయాలి. లేకపోతే బీసీ ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరు.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

'మేమెంతో మాకంత' అని బీసీ వర్గాలు నినదిస్తుండగా.. మాకేం సంబంధం, 'మీకు మీరే.. మాకు మేమే' అని కాంగ్రెస్ ప్రభుత్వం తెగేసి చెప్పేసింది. తెలంగాణలో నిర్వహించే కులగణన దేశానికే ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టాలనుకుంటున్న కులగణనకు ఆదర్శంగా నిలవాలని రాహుల్ గాంధీ చెప్తున్న మాటలను రేవంత్‌రెడ్డి సర్కార్ తుంగలో తొక్కింది. ఏకంగా సొంత పార్టీ నేతలే కాంగ్రెస్ సర్వేను తప్పుబడుతున్నారు. బీసీ సంఘాల మేధావులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. గతంలో కేసీఆర్ చేసిన సమగ్రకుటుంబ సర్వే సరైనదని ఎమ్మెల్సీ మల్లన్న కుండబద్దలు కొట్టారు. ఈ నేపథ్యంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందనుకున్న సర్వే కాస్త ప్రభుత్వ వైఫల్యం వల్ల తప్పులకు నిదర్శనంగా మారింది.

• రేవంత్ ఏది ముట్టినా బూడిదే...

రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఏది ముట్టుకున్నా భస్మాసుర హస్తం లాగా బూడిదే అవుతున్నది. తీసుకున్న ప్రతి నిర్ణయమూ వివాదాస్పదమే. ఉచిత బస్సు వ్యవహారాన్ని పక్కనపెడితే, మిగతా అన్నింటిలోనూ అభాసుపాలయ్యారు. కులగణన విషయానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన కులగణన నివేదికలో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింల మొత్తం జనాభా లెక్కలే తప్ప కులాలవారీగా గణాంకాలు ఎక్కడా విడుదల చేయలేదు. ఏ కులం వారు ఎంతమంది ఉన్నారన్న వివరాలు ప్రభుత్వ నివేదికలో పొందుపరచలేదు. దేశవ్యాప్తంగా 3,743 బీసీ కులాలుంటే, అందులో కేంద్ర ప్రభుత్వం 2,479 కులాలకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించింది. కేంద్రం కాకుండా రాష్ట్రాల స్థాయిలో బీసీ రిజర్వేషన్లు పొందుతున్న కులాలు 3,150 ఉన్నాయి. ఆ ప్రకారంగా తెలంగాణలో బీసీ కులాలు సుమారు 112 ఉన్నాయి. తెలంగాణలో 29 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలవుతున్నాయి. తమకు జనాభా దామాషా ప్రకారం తమకు 42 శాతం రిజర్వేషన్లు ఉండాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కులాలవారీగా గణన చేయకుండా కులగణన పేరుతో మరోసారి జనాభా లెక్కలు తీసింది. దీనికోసం ఖర్చు చేసిన 160 కోట్లు ఉంటే కొందరు రైతులకైనా రైతుభరోసా దక్కేది. పైగా ఈ నివేదికలో రాష్ట్రంలో హిందువులతో పాటు ముస్లింల జనాభా ఎంతో లెక్కలు చెప్పారు. ముస్లింలలో బీసీలు ఎంతమందో, ఓసీలు ఎంతమందో కూడా లెక్కలు వివరించారు. కానీ, క్రిస్టియన్లు, జైనులు, బౌద్ధులు, పారశీలు, సిక్కులు, సింధీలు ఇలా ఇతర మతాల వారీ జనాభా ఎంతెంత ఉందో మాత్రం వివరించలేదు. కులాలవారీ జనాభా బ్రేకప్ లేనప్పుడు అది కులగణన నివేదిక ఎలా అవుతుంది?

2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. ఆ నివేదికలో సమగ్రంగా అన్ని అంశాలను పొందుపరిచింది. ఆ నివేదికలోని వివరాలనే కాస్త అటూ ఇటూ తిప్పి కొత్త నివేదికలాగా ప్రవేశపెట్టినా సరిపోయేదేమో కానీ, డాంబికాలకు పోయి 160 కోట్లు ఖర్చుచేసి మరీ నిర్వహించిన సర్వే బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభాను గణనీయంగా తగ్గించేసింది. బీసీల జనాభా 2014 నాటి కంటే సుమారు 21 లక్షల మేర తగ్గిపోయింది. పోనీ, దీనివల్ల కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించినట్టు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా? అంటే, అదేం లేదని రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. కావాలంటే స్థానిక సంస్థల్లో 42 శాతం అమలుచేస్తామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు కొన్ని పార్టీపరంగా, కొన్ని పార్టీ రహితంగా జరుగుతాయి. కాబట్టి ఎంతమందికి ఇచ్చినా ప్రభుత్వానికి, పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదు. అసెంబ్లీ ఎన్నికల నాటికి కదా సమస్య, అప్పటికి చూసుకోవచ్చనే ఆలోచనతో రేవంత్ సర్కారు ఉన్నట్టున్నది.

- డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్

• వర్గీకరణలో మాదిగలకు దక్కని వాటా



రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ చేసిన సిఫార్సులు అశాస్త్రీయంగా ఉన్నాయి. దశాబ్దాలుగా వర్గీకరణ కోసం పోరాడిన కులాలకు ఇందులో తీవ్ర అన్యాయం జరిగింది. వర్గీకరణను మొక్కుబడిగా చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్రతిష్ఠపాలైంది. 59 ఎస్సీ కులాల్లో మాదిగల జనాభానే అధికం. ఒక వేళ జనాభా ఆధారంగా రిజర్వేషన్లను పంపిణీ చేస్తే అందులో ఎక్కువ వాటా దక్కాల్సింది మాదిగలకే. 17 లక్షల మంది మాలలకు ఐదు శాతం కేటాయిస్తే, అదే నిష్పత్తిలో 32 లక్షలున్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు రావాలి. కానీ, ఇచ్చింది 9 శాతం మాత్రమే.

కమిషన్ నివేదిక ప్రకారం మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాల్ని గ్రూప్-3లో చేర్చి వారికి 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రూప్-3లో ఉన్న కులాల జనాభా 33 శాతం. అంటే 33 శాతం ఉన్న వారికి 5 శాతం రిజర్వేషన్లు ఇస్తే 63 శాతం ఉన్న గ్రూప్-2కి దక్కాల్సింది 10 శాతం కానీ, 9 శాతం ఇచ్చారు. ఇక, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన కులాలుగా ఉండి గ్రూప్-1లో ఉన్న కులాలకు ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారు. ఎస్సీ జనాభాలో వారిది 3 శాతం. ఈ లెక్కన చూసినా మాదిగలకు జరిగింది అన్యాయమే.

గ్రూప్-1లో దశాబ్దాలుగా మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాల్ని చేర్చి మాదిగలు, మాదిగ ఉపకులాలతో సహా ఇతర అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలకు అన్యాయం చేశారు. పంబాల కులస్తుల జనాభా చాలా తక్కువ. మిగతా ఎస్సీలతో పోల్చినప్పుడు విద్యా, ఉద్యోగ రంగాల్లో వారు ముందున్నారు. ఇక, డక్కలి వాళ్లు రిజర్వేషన్ల ఫలితాలు పొందకుండా ప్రభుత్వ కుట్ర పన్నింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏబీసీడీ వర్గీకరణ సమయంలో 29 వేల జనాభా ఉన్న మన్నె కులం గ్రూప్-సిలో ఉండేది. వాళ్లని ఇప్పుడు గ్రూప్ 1లో కలిపారు.

1.11 లక్షల మంది ఉన్న బుడగ జంగాల్ని గ్రూప్-2లో చేర్చి రిజర్వేషన్‌ను 11 శాతానికి చేర్చవచ్చు. కానీ ఆ పని చేస్తే గ్రూప్-1, గ్రూప్-3లో ఉన్న కులాలకు లబ్ధి జరగకపోవచ్చని భావించి వారిని గ్రూప్-1లో కలిపారు. బేడ, బుడగ జంగాలు గతంలో మాదిగలతో పాటు ఒకే గ్రూప్‌లో ఉన్నారు. ఇక నేతకాని కులాన్ని గ్రూప్-3లో చేర్చాలన్న సిఫార్సుని ప్రభుత్వం ఆమోదించడం సరికాదు. ఎందుకంటే, 1.33 లక్షల మంది జనాభా ఉన్న ఆ కులంలోని ప్రజలు విద్యారంగంలో చాలా వెనుకబడి ఉన్నారు. కాబట్టి వారిని గ్రూప్-1లో చేర్చాలి. కానీ, గ్రూప్-3 రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకోవడానికి వారిని గ్రూప్-3లో చేర్చారు. కమిషన్ నివేదికను చూస్తే జనాభాను, వెనుకబాటుతనాన్ని అంచనా వేసి వర్గీకరణను చేసినట్టుగా లేదు. అందుకే మూడు గ్రూపులుగా ఉన్న వర్గీకరణను నాలుగు గ్రూపులుగా చేయాలి. మాదిగలకు, ఇతర వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వంపై ఉన్నది.

- సుంకె రవిశంకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే

• మాయమాటల కాంగ్రెస్‌ను మళ్లీ నమ్మొద్దు



మాయమాటలు, గారడీ విద్యలకు కాంగ్రెస్ పార్టీ పెట్టింది పేరు. విజ్ఞులను కూడా అజ్ఞానులుగా మార్చడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. సామాన్యులనే కాదు, పీజీలు, పీహెచ్డీలు చేసినవారిని కూడా ఆ పార్టీ మాయచేయగలదు. మార్పు మార్పు.. అంటూ గత అసెంబ్లీ ఎన్నికల్లో విజ్ఞులైన యువతను కూడా ఏమార్చి ఆ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకున్నది.

రాష్ట్రంలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో యువత పాత్ర ఎనలేనిది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో 1,65,000 పైగా ఉద్యోగాలను భర్తీ చేసినప్పటికీ నియామకాల్లో జరిగిన జాప్యం వల్ల నిరుత్సాహంలో ఉన్న నిరుద్యోగుల బ్రెయిన్‌ను కాంగ్రెస్ పార్టీ వాష్ చేసింది. అలవికాని హామీలు ఇచ్చి వారిని ఆశల పల్లకిలో ఊరేగించింది. జాబ్ క్యాలెండర్, ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలకు రూ.4000 చొప్పున నిరుద్యోగ భృతి, అమరుల కుటుంబాలకు నెలకు రూ. 25 వేల పింఛన్, యువతకు 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అంతేకాదు, విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు ఉచితంగా స్కూటీ, పీజీ పూర్తిచేస్తే లక్ష, డిగ్రీ పూర్తిచేస్తే 25,000, ఇంటర్మీడియట్‌కు 15,000, పదో తరగతి పాసయితే 10,000 చొప్పున ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టింది. దీంతో నిరుద్యోగులు, యువత కాంగ్రెస్ కార్యకర్తల అవతారం ఎత్తి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ ఒక్క హామీ కూడా అమలు కాలే దు. ఉద్యోగాలు ఇవ్వలేదు. పైగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి, తామే 55,000 ఉద్యోగాలు ఇచ్చామని యువతను మోసం చేస్తున్నది. నాడు కేసీఆర్ సర్కారుపై యువతను రెచ్చగొట్టినవాళ్లు ఇప్పుడు ఒక్కరూ కనిపించడం లేదు. డిక్లరేషన్లు ప్రకటించిన ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీ ముఖం చాటేశారు.

ఆరు నెలల క్రితం జరిగిన నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టిన యువతకు ఏం మేలు జరిగింది? ఈ ఆరు నెలల కాలంలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్ ఏ ఒక్క అంశం గురించి అయినా ప్రభుత్వాన్ని ప్రశ్నించారా? నిరుద్యోగుల ఒక్క సమస్యనైనా లేవనెత్తారా? నిరుద్యోగుల నిరసనకు అండగా నిలబడ్డారా? ఆయన భాష మారింది, బాడీ లాంగ్వేజ్ మారింది. స్వరం పూర్తిగా మారిపోయింది. ప్రశ్నిస్తానంటూ యువతకు మాయమాటలు చెప్పి ఎమ్మెల్సీగా గెలిచిన ఆయన రేవంత్‌రెడ్డి పంచన చేరిపోయారు. మరోసారి యువతను వంచించేందుకు వస్తున్న కాంగ్రెస్‌కు ఆదమరిచి అవకాశమిస్తే మన బతుకులు ఆగమైనట్టే. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రూపంలో మనకు ఒక చక్కని అవకాశం వచ్చింది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడగొడదాం.. జాబ్ క్యాలెండర్, సర్కారు కొలువులను సాధించుకుందాం.

- సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్

తెలుగు జానపదం బిరుదురాజు

దేవులపల్లి రమేశ్
99637 01294

బిరుదురాజు రామరాజు హైస్కూల్ విద్యార్థిగా ఉన్న నాటినుంచి, 'భారతి' మొదలైన పత్రికలలో మానవల్లి, వేటూరి, నిడదవోలు, మల్లంపల్లి, వంటి పరిశోధకుల వ్యాసాలు, వారు సంపాదించిన గ్రంథాలు పీఠికలు చదివారు. వారిలాగే సాహిత్య లోకానికి తెలియని కొత్త విషయాలు తాను కూడా చెప్పాలనే నిశ్చయంతో పరిశోధన రంగంలో అడుగుపెట్టారు. జానపద విజ్ఞానంలో వర్సిటీల పరిశోధనల్లో దక్షిణ దేశ భాషలన్నింటిలోనూ, బిరుదురాజు రామరాజు తెలుగు జానపద గేయ సాహిత్యం మొదటి సిద్ధాంత గ్రంథమైంది.

జానపద గేయరంగంలో అనేక జానపద గేయాలు, సంకలనాలు బిరుదరాజు ప్రకటించారు. తెలుగులో, ఇంగ్లీషులో, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనాత్మక పత్రాలు, రామరాజు చదివారు. అంతేకాదు, తెలంగాణ అంతా తిరిగి వందల కొద్ది తెలుగు, సంస్కృతం తాళపత్ర గ్రంథాలు, పదుల కొద్దీ, శిలాశాసనాలను సేకరించారు. అచ్చు కాకుండా పడి ఉన్న తెలుగు, సంస్కృత కావ్యాలను దాదాపుగా నూరింటిని సాహిత్య ప్రపంచానికి తెలియజేశారు. మరుగునపడిన మాణిక్యాలు, చరిత్రకు ఎక్కని చరితార్థులు అనే పేరుతో అనేక వ్యాసాలు పత్రికల్లో బిరుదురాజు రాశారు.

పరిష్కరించిన గ్రంథాలు: సంస్కృతంలో కాళహస్తి కవి రచించిన 'వసు చరిత్రం', మధురవాణి రచించిన రామాయణ సార తిలకం, వెల్లాల ఉమామహేశ్వర్లు 'శృంగార శేఖర భాణం', శ్రీకృష్ణదేవరాయల జాంబవతి పరిణయ నాటకం, మొదటిసారిగా పరిష్కరించిన బిరుదురాజు అనంత రామయ్య, సీతా విజయ చంపు వంటి సంస్కృత కృతులను కూడా పరిష్కరించారు.

తెలుగు గ్రంథాల పరిష్కరణ: తెలుగులో బొడ్డుచర్ల చిన తిమ్మ కవి 'ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం' చింతలపల్లి ఛాయాపతి 'రాఘవాభ్యుదయం', వెంకటాద్రి నాయకుని 'సకల జీవ సంజీవనం', పాల్కుర్కి సోమనాథుని ' పండితారాధ్యోదాహరణం' అనే కావ్యాలను మొదటగా సేకరించి ప్రకటించారు. బిరుదురాజు రామరాజు ఉర్దూ, తెలుగు నిఘంటువును



కూర్చారు. ఇంగ్లీష్, హిందీల నుంచి నాలుగు గ్రంథాలు అనువదించారు. బిరుదురాజు పర్యవేక్షణలో 38 మంది ఎంఫిల్, పీహెచ్‌డీలు సంపాదించారు.

తెలుగు జానపద విజ్ఞానరంగంలో విశేషమైన కృషిచేసిన వ్యక్తి ఆచార్య బిరుదు రాజు రామరాజు. పరిశోధకుడిగా, పండితుడిగా, ఆచార్యుడిగా, జాతీయ వక్తగా ప్రసిద్ధి పొందిన ఈయన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో 1925, ఏప్రిల్ 16న జన్మించారు. దేవనూరు, మడికొండ, హన్మకొండలో ప్రాథమిక విద్య మాధ్యమిక విద్యతో పాటు ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బీఏ పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ.తెలుగు, ఖండవల్లి లక్ష్మీ రంజనం పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. 1967-1974 వరకు వరంగల్ స్నాతకోత్తర కేంద్రంలో పనిచేసిన బిరుదరాజు రామరాజు 1983లో పదవీ విరమణ పొందారు. ఈయన చేసిన సాంస్కృతిక సేవకు గాను జాతీయాచార్య పదవి లభించింది. 2010, ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో మరణించారు.

(నేడు బిరుదురాజు రామరాజు వర్ధంతి)

రేవంత్ ప్రభుత్వం చెల్లని నాణేల్లాంటి హామీలతో ప్రజలకు భ్రమలు కల్పిస్తున్నది. వాటిలో ఒకటి బీసీ కులగణన. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల అవసరార్థం ఇప్పుడు ఈ లెక్కలు చేపట్టింది. మొదట ఈ కార్యాన్ని బీసీ కమిషన్ చేతిలో పెట్టింది. సరిపడా సిబ్బంది లేని బీసీ కమిషన్ తన వల్ల కాదని చెప్పలేక, వివిధ శాఖల సహకారంతో ఈ కార్యాన్ని ఎత్తుకోవడానికి సిద్ధపడింది.

'లెక్క'ల పరీక్షకు మార్కులు సున్నా



బద్రి నర్సన్
94401 28169

నిజానికి బీసీ కమిషన్ విధులు వేరు. సర్వే చేసినా ఆ సంస్థ ఇచ్చే గణాంకాలకు ఎలాంటి చట్టబద్ధత ఉండదు. ఆ విషయం ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు. ఈ కుట్రను గమనించిన బీసీ నేతలు కులగణన కోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. దాని నియామకం కోసం కోర్టుకు వెళ్లారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340కి లోబడి చేయని గణన చెల్లదని ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. అప్పుడు దిగొచ్చిన సర్కారు ఓ విశ్రాంత ఉన్నతాధికారి నేతృత్వంలో కులగణన కోసం ఓ డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. నవంబర్, 2024 మొదటి వారంలో ఈ సర్వే జరిగింది.

ప్రభుత్వం ఈ గణనకు 'సామాజిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే' అని పేరు పెట్టింది. ప్రశ్నావళిని 'ఆల్ ఇన్ వన్' స్టైల్‌లో రూపొందించారు. 'మీరు ఏ కులానికి చెందినవారు?' అని ఒకే ప్రశ్న ప్రజలను అడిగితే స్పష్టమైన సమాధానం వచ్చేది. కానీ 'మీకు ఎన్ని ఇండ్లున్నాయి, ప్లాట్లున్నాయా? భూములున్నాయా? ఆదాయమెంత? కారు ఉన్నదా? ఇన్‌కమ్ టాక్స్ కడుతున్నారా?' లాంటి 57 ప్రశ్నలు ఉండేసరికి ఇదేదో నష్టం చేసేలా ఉందని కొందరు భావించారు. వివరాలు సరిగ్గా చెప్పలేదని, ఈ లెక్కలన్నీ మీకెందుకు చెప్పాలని, కులం తప్ప మరేమీ చెప్పబోమని గణనకు వెళ్లిన ఉద్యోగులను జనం నిలదీస్తున్నారని అప్పుడే పత్రికల్లో వచ్చింది. సర్వేలో చెప్పిన కులం వాస్తవమే అని నమ్మడానికి రుజువేమీ లేదు. ఇంటివాళ్లు ఏం చెప్పారో, ఎన్యుమరేటర్ ఏమి రాసుకున్నాడో అనే విషయంలోనూ స్పష్టత లేదు.

ఈ గణనలో సేకరించిన వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, ఎవరికీ ఇవ్వబోమని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే. ఒక నిర్ణీత ప్రాంతానికి చెందిన కుటుంబాలు తెలిపిన కులానికి చెందిన సమాచారం ప్రభుత్వం ఇవ్వగలిగితే 'ఈ లెక్కలు తప్పుల తడక' అంటున్న సంఘాలు, పార్టీలు ఆయా ప్రాంతాల్లో రీ సర్వే నిర్వహించుకొనే అవకాశం ఉన్నది. ఎవరైనా ఈ పని చేపట్టడానికి ముందుకు వస్తే ప్రభుత్వం అధికారికంగా సహకరించాలి.

2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జరిపిన 'సమగ్ర కుటుంబ సర్వే'లో 51శాతం ఉన్న బీసీల జనాభా పదేండ్లలో 5 శాతం ఎలా తగ్గుతుందని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టాయి. దీనికి సర్కారు వద్ద సరైన జవాబు లేకుండాపోయింది. ఈ సర్వేలో ప్రభుత్వం కావాలని బీసీల సంఖ్య తగ్గించిందా? లేక, సమాచార సేకరణలో లోపముందా? ఏదైనా జరగవచ్చు. బీసీల జనాభా ఎలా తగ్గిందని మేధోమథనం చేయకుండా కాంగ్రెస్‌లోని బీసీ పెద్దలు, మంత్రులు 'అంతా పద్ధతి ప్రకారమే జరిగింది. ఇందులో లోపాలు లేవు' అనడం తమ జాతికి ద్రోహం చేయడమే అవుతుంది. రాష్ట్రంలో 96.9 శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని ప్రభుత్వం చెప్తున్నది. పర్సంటేజీలో 3 శాతం అనిపించినా సర్వేలో పాల్గొనని కుటుంబాల సంఖ్య 3.56 లక్షలు. అంటే సుమారు 15 లక్షల మంది వివరాలు సేకరించలేదు. వాటి ని కూడా సేకరించి లెక్కల్లో కలపాలి. ప్రశ్నావళి ఒకరితో పూరింపబడి మరొకరితో కంప్యూటర్‌లో ఎంట్రీ అయింది. ఇందులో మానవ తప్పిదాలు జరిగే అవకాశం ఉన్నది. ఈ విషయంలో క్రాస్‌చెక్ అవసరం. ప్రశ్నల్లో కులం లేదు, మతం లేదనే కాలమ్స్ కూడా ఉన్నాయి. వాటిని వాడుకోవచ్చు. 'లేదు' అన్న వ్యక్తులు ఎందరున్నారో ప్రభుత్వం చెప్తే బాగుంటుంది.

కులగణన తప్పులపై అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసి ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే బీజేపీ సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతున్నది. ఎన్నో ఏండ్లుగా దేశంలోని వెనుకబడిన వర్గాలు జనాభా లెక్కల్లో 'కులం' కూడా చేర్చాలని కోరుతున్నాయి. కులాల లెక్కలు దేశాన్ని ముక్కలు, చెక్కలు చేస్తాయనేది బీజేపీ కేంద్ర పెద్దల మొరటు అభిప్రాయం. కులం గురించి అడిగేవారిని దేశ విచ్ఛిన్నకర శక్తులుగా ప్రచారం చేస్తున్నారు. దీనివల్ల క్యాస్ట్ ఫీలింగ్ పెరుగుతుందని, మనుషుల మధ్య అగాథం ఏర్పడుతుందని వారు కొత్త రాగం ఎత్తుకున్నారు. జనగణన జరిగినా అందులో కులం చేర్చే ప్రసక్తే లేదని కేంద్రం గట్టిగా చెప్తున్నది. ఆ పార్టీలోని బీసీలు ఈ విషయంలో కిమ్మనడం లేదు.

కులగణనలో బీసీల సంఖ్య తప్పుగా ఉన్నదని, బీసీల్లో ముస్లింలను కలిపి ఎలా చూపిస్తారని రాష్ట్ర బీజేపీ నేతలు నిలదీస్తున్నారు. ఇప్పుడు తెలంగాణలోని బీసీ, మాదిగల అగ్రనేతలు బీజేపీ మనుషులయ్యారు. వారిని ఆయా కుల నేతలుగా కాకుండా బీజేపీ ప్రతినిధులుగానే ప్రభుత్వం భావిస్తున్నది. వారి డిమాండ్ల సాధన బీజేపీ ఖాతాలోకి వెళ్తుంది. 'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడే, బీసీ రిజర్వేషన్‌ను నీరుగార్చే కుట్రలో భాగంగానే బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని' ఆర్.కృష్ణయ్య అంటున్నారు. ఈ లెక్కలు సరిచేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీసీల తిరుగుబాటు తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. అదే నిజమైతే బీజేపీ ఆయనకు దన్నుగా నిలబడుతుందా? కేంద్రం నుంచి ఆయనకు ఎలాంటి సాయం అందుతుందో చూడాలి.